16న పోచమ్మ తల్లి ఆలయ మహోత్సవం

నిజాంపేట్ : కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్ 1, 3లో పోచమ్మ తల్లి ఆలయ 3వ వార్షిక వేడుకలు ఈ నెల 16న జరుగనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. 16న ఉదయం 6:15 గంటలకు లక్ష్మీ గణపతి హోమం, 7:45 గంటలకు పంచామృతం, అష్టఫలాల అభిషేకం, 9 గంటలకు అమ్మవారి అలంకరణ, అమ్మవారి దర్శనం ఉంటుందని తెలిపారు. అనంతరం 1:15 గంటలకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు.

త్వరలోనే కొత్త దరఖాస్తుల సర్వే


ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

జగద్గిరిగుట్ట: ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగంగా జరుగుతుంది. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలో మొత్తం ప్రజాపాలనలో తీసుకున్న 12,204 అప్లికేషన్ల సర్వే దాదాపు పూర్తి చేశారు. కాగా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారి అప్లికేషన్లు డివిజన్ వార్డు కార్యాలయంలో స్వీకరించారు. బుధవారం వరకు 1972 అప్లికేషన్లు వచ్చాయని, త్వరలోనే సర్వే ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

ఖాళీ స్థలాన్ని ప్రజా అవసరాలకు వినియోగించాలి

నిజాంపేట్: నిజాంపేట్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 334 స్థలంలో కమ్యూనిటీ హాల్, ఇతర అవసరాల నిమిత్తం భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని బుధవారం నివాస్ జర్నలిస్ట్స్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కొంతకాలంగా కాలనీవాసులు అందరు కలిసి ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఈ స్థలాన్ని ప్రజా అవసరాలకు వినియోగించుకోవడానికి ఒక కమ్యూనిటీ భవనాన్ని ఏర్పాటు చేసే విధంగా మున్సిపల్ కార్పొరేషన్ చర్యలు తీసుకోవాలని కోరారు.

సమ్మక్క సారలమ్మలకు ప్రత్యేక పూజలు



జగద్గిరిగుట్ట: మాఘ శుద్ధ పౌర్ణమి సందర్భంగా జగద్గిరిగుట్ట కొండపై ఉన్న సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్ద బుధవారం జోగినీలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడారం మినీ జాతర ప్రారంభమైన సందర్భంగా ఇక్కడ కూడా 4 రోజుల పాటు పూజలు చేయనున్నట్లు వారు తెలిపారు. రానున్న 3 రోజుల్లో అమ్మవార్ల ఎదుర్కోలు, చీరలు, బంగారం సమర్పించడం, గద్దెల వద్ద పటం ఏర్పాటు తదితర పూజలు ఉంటాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరని తెలిపారు.

వాహనంపై స్వామి వారి ఊరేగింపు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ గ్రామంలో వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం హోమం, బలిహరణం, మంగళస్నానం, సాయంత్రం 6 గంటలకు హనుమత్ వాహనంపై అలంకార సేవ ఊరేగింపు నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు మంగళ హారతులు పట్టారు. రాత్రి 9 గంటలకు స్వామివారి ఎదుర్కోలు, రాత్రి 10 గంటలకు తిరు కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిషేధిత డ్రగ్స్ తరలిస్తున్న ఇద్దరి రిమాండ్

కుత్బుల్లాపూర్: మత్తు పదార్థాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పేట్‌బషీరాబాద్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సీఐ విజయవర్ధన్ వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం సయ్యద్‌నగర్‌లోని కట్టమైసమ్మ ఆలయం సమీపంలో పేట్‌బషీరాబాద్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. టీఎస్08జీఎస్ 4738 స్కూటీపై వచ్చిన ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీలు చేయగా.. వారి వద్ద 32 గ్రాముల ఎండీఎంఏ నిషేధిత డ్రగ్స్ పట్టుబడ్డాయి. నిందితులను సుభాష్‌నగర్ పైప్‌లైన్ రోడ్డులోని భాగ్యలక్ష్మికాలనీకి చెందిన రాకేష్‌కుమార్ బిష్ణోయ్(20), సురేష్‌కుమార్ బిష్ణోయ్(24)లుగా గుర్తించారు. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వీరిద్దరు గత కొంతకాలంగా నిషేధిత డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు.


కలుషిత జలాలతో అంబీర్ చెరువు



అంబీర్ చెరువును కాపాడాలని ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు(ఫైల్)

అంబీర్ చెరువుకు ఆధునికీకరణేది?

- డ్రైనేజీ నీటితో దుర్గంధం
- పేరుకుపోయిన గుర్రపుడెక్క
- డంపింగ్ కేంద్రంగా చెరువు పరిసరాలు
- చెరువును సంరక్షించాలని సేవ్ అంబీర్ చెరువు పేరిట నిరసనలు


చెరువులోని గుర్రపు డెక్క

నిజాంపేట్: అంబీర్ చెరువు అంటే తెలియని వారు ఉండరు. కూకట్‌పల్లి జేఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ రావాలంటే చెరువు మధ్యలో నుంచి ఉన్న రోడ్డు మార్గాన్నే రావాలి. ఈ రోడ్డుకు ఇరు వైపులా చెరువు ఎంతో అందంగా ఉంటుంది. అంతే కాకుండా చెరువుకు నిజాంపేట్ వైపు వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. రెండు వైపుల బతుకమ్మ ఘాట్‌లు ఉన్నాయి. ఇలా చెరువును ఓ మినీ ట్యాంక్ బండ్‌లా మార్చుకోవాలన్న స్థానికులకు నిరాశ తప్పడం లేదు. చెరువు పరిసర ప్రాంతాల్లో నివసించే వేలాది కుటుంబాలు నిత్యం ఇక్కడి కాలుష్య జలాలతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

> వర్షపు నీటితో కళకళలాడిన అంబీర్ చెరువు నేడు కలుషిత నీటితో విషసాగరంగా మారింది. ఇటు శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలోని పలు కాలనీల నుంచి డ్రైనేజీ నీరు మొత్తం అంబీర్ చెరువులో కలిసి కలుషితమైంది. చెరువును ఆహ్లాదంగా మార్చుకునేందుకు స్థానికులు వివిధ రూపాల్లో తమ నిరసనలు కొనసాగిస్తున్నారు. ప్రగతినగర్, నిజాంపేట్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో అంబీర్ చెరువు చాలా పెద్దది. సుమారు 270 ఎకరాల విస్తీర్ణం ఉండాల్సిన చెరువు ప్రస్తుతం అనేక ఆక్రమణల తరువాత వంద ఎకరాల వరకు విస్తీర్ణం తగ్గి ఉండవచ్చునని అధికారుల అంచనా. ఇకనైనా అధికారులు చెరువులో డ్రైనేజీ నీరు కలువకుండా చర్యలు తీసుకొని ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని పరిసర ప్రాంతాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విషసాగరంగా ..

అంబీర్ చెరువులో హైదర్ నగర్, నిజాంపేట్, ప్రగతినగర్ తదితర ప్రాంతాలలోని సుమారు 15 కాలనీ నుంచి డ్రైనేజీ నీరు ఇందులో చేరుతుంది. హైదర్‌నగర్ వైపు నుంచి చెరువులో డ్రైనేజీ నీరు కలువకుండా పైపులైన్లు వేశారు. కానీ ఇటు ప్రగతి నగర్ వైపు మాత్రం డ్రైనేజీ నీరు కలువకుండా చర్యలు తీసుకోకపోవడంతో చెరువు మొత్తం కలుషితమైంది.దీంతో చెరువు మొత్తం గుర్రపు డెక్కతో దుర్గంధ భరితంగా మారింది.

చెరువులోనే చెత్త, ఇతర వ్యర్థాలు

అంబీర్ చెరువు మధ్యలో నుంచి రోడ్డు ఉండటంతో ఈ ప్రాంతం ఓ మినీ ట్యాంక్ బండ్‌ల ఉంటుంది. దీంతో చెరువుపై ప్రతి రోజు మాంసపు దుకాణాలు ఉంటాయి. ఇక ఆదివారం, పండుగల సమయంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా చెరువులోనే చెత్త వేయడం , మాంసపు వ్యర్థాలు సైతం చెరువులోనే పడేస్తున్నారు. ఇతర వ్యాపారులు సైతం చెరువును డంపింగ్ యార్డుగా మార్చుకోవడంతో చెరువు మొత్తం కలుషిత జలాలతో కంపు కొడుతోంది.

జీహెచ్‌ఎంసీ, కార్పొరేషన్ల మధ్య సమన్వయ లోపం

అంబీర్ చెరువు జీహెచ్‌ఎంసీతో పాటు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ల మధ్యలో ఉంటుంది. చెరువుకు జేఎన్‌టీయూ వైపు జీహెచ్‌ఎంసీ, ప్రగతి నగర్ వైపు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లు బాధ్యతగా ఉన్నాయి. చెరువు విషయంలో ఇరు ప్రాంతాల అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయలోపం స్పష్టంగా కనిపిస్తుంది. ఎవరికి వారు తమ పరిధి కాదని బాధ్యతల నుంచి తప్పుకుంటూ చెరువు అభివృద్ధిని పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విషజ్వరాల బారిన పరిసర ప్రజలు

చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. చెరువులోని కలుషిత జలాలతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. సాయంత్రం అయ్యిందంటే చాలు ఇంటి తలుపులు తీయాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సేవ్ అంబీర్ చెరువు పేరుతో..

అంబీర్ చెరువును కాపాడాలని కోరుతూ కొంత కాలంగా స్థానిక ప్రజలు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అధికారులను, ప్రజాప్రతినిధులను కలుస్తూ సమస్య తీవ్రతను వివరిస్తున్నారు. ప్రజలను చైతన్యం చేసి అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నారు. సెలవు రోజుల్లో ర్యాలీలు నిర్వహిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ వంతు బాధ్యతను ప్రజలు నిర్వర్తిస్తున్నారు.

ప్రారంభించారు.. మరిచారు

- సర్కిళ్ల లో నాలుగు మహిళా శక్తి క్యాంటీన్‌లు ప్రారంభం
- జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయం సమీపంలో ప్రారంభించిన అనంతరం తెరవని క్యాంటీన్


జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయం వద్ద మహిళా శక్తి క్యాంటీన్

జగద్గిరిగుట్ట: గ్రేటర్‌లో మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మహిళా శక్తి క్యాంటీన్‌లను ప్రారంభించారు. అందులో భాగంగా జంట సర్కిళ్లలో గాజులరామారం సర్కిల్ మండల కార్యాలయం వద్ద, సర్కిల్ కార్యాలయంలో, జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయం వద్ద, కుత్బుల్లాపూర్ సర్కిల్ సూరారంలో ప్రారంభించారు. గత సంవత్సరం డిసెంబర్ 20న కార్పొరేటర్ జగన్, గాజుల రామారం సర్కిల్ డీసీ మల్లయ్యతో కలిసి జగద్గిరిగుట్ట వార్డు కార్యాలయం సమీపంలో క్యాంటీన్ ప్రారంభించారు. ప్రారంభించిన రోజు నుంచి ఇప్పటి వరకు తెరవలేదు. ఇక ఆ క్యాంటీన్ ముందు పార్కింగ్, వెనుక మరుగుదొడ్లలాగా వాడుకోవడం విశేషం. లక్షలు వెచ్చించి ఓపెన్ చేసిన ఈ క్యాంటీన్‌ను ఇలాగే వదిలేస్తే తుప్పపట్టి నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఈ విషయమై సంబంధిత సమాఖ్య మహిళల వివరణ కోరగా.. ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో బిజీగా ఉండడం వల్ల ఓపెన్ చేయలేదని, త్వరలోనే తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నల్లగుట్ట శివాలయంలో 24వ శివ మహాపడి పూజ కార్యక్రమాన్ని దూదిమెట్ల సోమేశ్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సుమారు 50 మంది శివస్వాములు కాలినడకన నల్లగుట్ట నుంచి శ్రీశైలం వరకు పాదయాత్రగా బయలుదేరుతున్న సందర్భంగా శ్రీశైలంగౌడ్ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యాదిలాల్, పెంటయ్య, కృష్ణారెడ్డి, సురేష్ రెడ్డి, శివ స్వాములు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములవ్వాలి

నిజాంపేట్: ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములవ్వాలని కాంగ్రెస్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని శ్రీహోమ్స్ కాలనీలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి, రాజేందర్, వేణుగోపాల్‌రెడ్డి, జిత్తు, అంజిబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న కొలన్ రాజశేఖర్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి

ఆలయ నిర్మాణానికి విరాళం


చెక్కు అందజేస్తున్న కాసాని వీరేష్

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో అష్టలక్ష్మి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని వీరేష్ ముదిరాజ్ రూ.50 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తోచిన సాయం అందించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.విష్ణువర్ధన్‌రావు, పి.రాంబాబు, సీహెచ్ లింగయ్య, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతి


మంత్రికి సమస్య వివరిస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: నిషేధిత అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం పరిధిలోని మహాదేవపురం వెంచర్ వారు 30 సంవత్సరాలుగా 100 ఇళ్లకు పైగా నిర్మించారని, ప్రస్తుతం అక్కడ నూతనంగా రిజిస్ట్రేషన్, పర్మిషన్ కోసం ప్రయత్నించగా.. వారి స్థలాలు ప్రోహిబిటెడ్‌లో ఉన్నాయన్నారు. స్థానిక ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మంత్రికి వివరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అతి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయానికి వివిధ బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాలు అందజేశారు. రోడ్లు, తాగునీటి, డ్రైనేజీ పైపులైన్‌లు వేయాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు.

◆ గాజులరామారం డివిజన్ పరిధి ఇంద్రానగర్-ఏలోని పోచమ్మ ఆలయం 9వ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే వివేకానంద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ శ్రీనివాస్ యాదవ్, శంకరయ్య, బసవరాజు, చిన్న చౌదరి, మహేష్, సంక్షేమ సంఘం నాయకులు బద్రి, రమేష్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పోచమ్మ ఆలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

పరికి చెరువును పరిరక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమా మహేష్

జగద్గిరిగుట్ట: పరికి చెరువును పరిరక్షించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్ చేశారు. బుధవారం షాపూర్‌నగర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వివేకానంద్ ఇటీవలే నిజాంపేట్ పరిధిలోని తుర్కా చెరువు, శ్రీరామ్ కుంట చెరువును సందర్శించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అదే విధంగా నియోజకవర్గ పరిధిలోని ఇతర చెరువులను కుడా కాపాడాలని అధికారులను ఆదేశించాలని కోరారు. జగద్గిరిగుట్ట, గాజుల రామారం పరిధిలో 65 ఎకరాలలో విస్తరించిన పరికి చెరువు సగం కబ్జాకు గురైందన్నారు. నేడు మిగిలి ఉన్న సగం కూడా కబ్జాకు గురయ్యే పరిస్థితి ఏర్పడిందని, వెంటనే చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో స్వామి, శ్రీనివాస్, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్వాదశ జ్యోతిర్లింగాల శివ మహా పడిపూజ



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపైనున్న మాణికేశ్వరి మాతా ఆలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాల శివ మహా పడిపూజ, ఆలయ 19వ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. శివ భక్తులతో పాటు స్థానికులు పడిపూజలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తుది దశకు కల్వర్టు పనులు



జగద్గిరిగుట్ట: షాపూర్‌నగర్ నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే పైప్‌లైన్ రోడ్డులో కల్వర్టు పనులు తుది దశకు చేరాయి. గత సంవత్సరం నవంబర్‌లో కోటి రూపాయలతో పనులను ప్రారంభించారు. ప్రతీ సంవత్సరం వర్షాలు పడినప్పుడల్లా ఈ కల్వర్టు వద్ద నీరు మోతాదుకు మించి ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కల్వర్టు పూర్తి చేస్తే కొంత మేలు జరుగుతుంది. ఈ పైప్‌లైన్ రోడ్డులో ఇంకా 2 కల్వర్టులు ఉన్నాయని, వాటిని కూడా పూర్తి చేసి శాశ్వత పరిష్కారం చూపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చింతల్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం

చింతల్: ఐడీపీఎల్ జంక్షన్ పట్వారి నగర్‌లోని సిరి టవర్స్‌లో బుధవారం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర చింతల్ బ్రాంచ్‌ను ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా బ్యాంక్ జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్ హాజరై మాట్లాడారు. చింతల్ బ్రాంచ్ మేనేజర్‌గా ఉషశ్రీ బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో డీసీపీ సురేష్ కుమార్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం నేతల అరెస్ట్

కుత్బుల్లాపూర్: మున్నూరుకాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన తలపెట్టిన సీఎం నివాస ముట్టడిని పోలీసులు భగ్నం చేశారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పుప్పాల భాస్కర్‌తో పాటు నియోజకవర్గ మున్నూరు కాపు ముఖ్య నాయకులను పేట్‌బషీరాబాగ్ పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కుల గణనలో మున్నూరుకాపుల సంఖ్యను తక్కువగా చూపి రాజకీయంగా దెబ్బతీసే కుట్ర పన్నారని ఆరోపించారు. రూ.5 వేల కోట్లతో మున్నూరు కాపు కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, మంత్రి వర్గంలో ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పందిరి యాదగిరి, సాయిని శ్రీనివాస్, ముకుందరావు, రవికుమార్, ప్రసాద్ నాయుడు, నారాయణలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

బీఆర్‌ఎస్ ఫ్లెక్సీలు చింపిన వారిపై చర్యలు తీసుకోవాలి

జీడిమెట్ల: బీఆర్‌ఎస్ పార్టీ నాయకుల ఫ్లెక్సీలను చింపిన వారిపై చర్యలు తీసుకోవాలని నాయకులు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. సుభాష్‌నగర్ డివిజన్‌లోని ఎస్.ఆర్.నాయక్‌నగర్‌లో ఫిబ్రవరి 4న పెద్దమ్మ పోచమ్మ తల్లి వార్షికోత్సవాలు జరిగాయి. పండుగ సందర్భంగా స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈనెల 9వ తేదీన రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలో వచ్చి ఫ్లెక్సీలను చింపారని తెలిపారు. సీసీ కెమెరాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని సీఐ గడ్డం మల్లేష్‌ను కోరారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, గుబ్బల లక్ష్మీనారాయణ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వారానికే మళ్లీ లీకేజీ!

రోడ్డుపై పారుతున్న మురుగు


పేట్‌బషీరాబాద్ సెయింట్‌ఆన్స్ స్కూల్ రోడ్డులో పారుతున్న మురుగునీరు

కుత్బుల్లాపూర్ : జీడిమెట్ల డివిజన్ పేట్ బషీరాబాద్ సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో డ్రైనేజీ పొంగి పొర్లుతుంది. వారం రోజుల క్రితమే మరమ్మతులు చేసిన అధికారులు తిరిగి అదే ప్రాంతంలో డ్రైనేజీ లీకేజీ కావడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్కూల్ విద్యార్థులతో పాటు వివిధ కాలనీలకు సంబంధించిన ప్రజలు ఇటువైపుగా రాకపోకలు సాగిస్తారు. నిత్యం డ్రైనేజీ పొంగుతున్న విషయంపై అధికారులు కేవలం నామమాత్రంగా పనులు చేసి చేతులు దులుపుకోవడంతో నిత్యం ఇక్కడ డ్రైనేజీ పొంగుతుంది. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఘనంగా బచ్‌పన్ ప్లే స్కూల్ వేడుకలు

కుత్బుల్లాపూర్: చింతల్, వేంకటేశ్వర నగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్ లో బుధవారం విద్యా సంస్థల 21 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ టీవీఆర్ కోటిరెడ్డి ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


చిన్నారులతో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు

అన్నదానంతో ముగిసిన కట్టమైసమ్మ జాతర


అన్నదానంలో పాల్గొన్న భక్తులు

సుభాష్‌నగర్: సూరారంలో నాలుగు రోజులపాటు జరిగిన కట్టమైసమ్మ జాతర బుధవారం జరిగిన అన్నదానంతో ముగిసింది. ఉదయం నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అన్నదానం సాయంత్రం వరకు కొనసాగింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: ఫీడర్ల లైన్ నిర్వహణ నేపథ్యంలో గురువారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ జీడిమెట్ల ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీడిమెట్ల గ్రామం, భీమా ఫ్రైడ్, గ్రీన్ పార్కు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లేన్, మెడ్ వన్ ఆసుపత్రి, 11కేవీ మీనాక్షి ఫీడర్ పరిధిలో గ్రీన్ పార్కు, మీనాక్షి కాలనీ, స్ప్రింగ్ ఫీల్డ్ కాలనీ, 11కేవీ గాయత్రినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గాయత్రినగర్, గోదావరి హోమ్స్ పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.